ఇంద్రవెల్లి సభను విజయవంతం చేయాలి

నార్నూర్, డిసెంబర్ 5: ఇంద్రవెల్లి మండల కేంద్రంలో ఈనెల డిసెంబర్ 9న నిర్వహించనున్న ఆదివాసీ అస్తిత్వ పోరాట మహాసభను విజయవంతం చేయాలని తుడుం దెబ్బ జిల్లా ఉపాధ్యక్షుడు మెస్రం మానిక్‌రావు, మండలాధ్యక్షుడు ఆడా శ్రీరామ్ పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రం లోని కుమ్రం భీం భవన్‌లో వారు మాట్లాడారు. ఇంద్రవెల్లిలో నిర్వహించే సభకు తొమ్మిది తెగల ఆదివాసీలు తరిలిరావాలన్నారు. రాజకీయ నాయకులు, ఆదివాసీ అనుబంధ సంఘాల నాయకులు, మేధావులు, ఉద్యోగస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలని కోరారు. ఇక్కడ మాజీ సర్పంచ్ మడావి సాగర్, మాజీ ఎంపీటీసీ ధర్మ, మండల కార్యదర్శి మడావి ఆనంద్‌రావు తదితరులున్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

ఎదులాపురం, డిసెంబర్ 5: విద్యార్థుల ఆరోగ్యంపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. గురువారం కలెక్టర్ సమావేశ మందిరంలో ఆరోగ్య పాఠశాలపై రివ్యూ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాల విద్యార్థులు తయారు చేసిన చార్టులు, చిత్రాలను ప్రొజెక్టర్ ద్వారా ప్రదర్శించారు. కలెక్టర్ తిలకించి విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో డీఈవో ప్రణీత, అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'చలో బస్ భవన్'కు తరలిన కార్మికులు

నిర్మల్ అర్బన్, డిసెంబర్ 5 : ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ టీఎంయూ ఆధ్వర్యంలో తలపెట్టిన చలో బస్ భవన్‌కు గురువారం నిర్మల్ డిపోకు చెందిన కార్మికులు ప్రత్యేక వాహనంలో హైదరాబాద్ తరలివెళ్లారు. ఈ సందర్భంగా టీఎంయూ రీజినల్ సెక్రటరీ గంగాధర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఆర్టీసీ ఉద్యోగులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ బస్ భవన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ప్రభుత్వం తక్షణమే స్పందించి తమ హామీలను నెరవేర్చాలని అన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ కార్మికులు తదితరులున్నారు.

నేటి నుంచి జిల్లాస్థాయి సైన్స్ ఫేర్ పోటీలు

నిర్మల్ అర్బన్, డిసెంబర్ 5 : నిర్మల్ జిల్లా కేంద్రంలోని సెయింట్ థామస్ పాఠశాలలో శుక్రవారం జిల్లా స్థాయి ఇన్స్పైర్, సైన్స్ ఫెయిర్ ను నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి రామారావు, జిల్లా సైన్స్ అధికారి డాక్టర్ వినోద్ కుమార్ తెలిపారు. ఇందుకు సంబంధించి ఏర్పాట్లను పూర్తి చేసినట్లు తెలిపారు. పోటీల ప్రారంభానికి ముఖ్య అతిథిగా జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, తెలంగాణ విద్యాకమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి హాజరవుతున్నారని తెలిపారు. సైన్స్‌ఫెయిర్ నిర్వహణకు 22 కమిటీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సుదూర ప్రాంతాల నుంచి వివిధ ప్రాజెక్టులతో ప్రదర్శనకు వచ్చే విద్యార్థులకు వసతి ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతరం ఏర్పాట్లను పరిశీలించారు.

సీపీఎస్ రద్దుకు కృషి చేస్తా

ఎదులాపురం, డిసెంబర్ 5: ఉపాధ్యాయుల సమస్యలపై పోరాటంతోపాటు సీపీఎస్ రద్దుకు కృషి చేస్తానని పీఆర్టీయూటీఎస్ అధికార ఉపాధ్యాయ అభ్యర్థి వంగ మహేందర్ రెడ్డి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ప్రింట్ మీడియా ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. మొదటి ప్రాధాన్యత ఓటు తనకు వేసి గెలిపించాలని కోరారు. సమావేశంలో కొమ్ము కృష్ణ కుమార్, టీ స్వామి, డీ గోవర్ధన్, ఆరె భాస్కర్, చోప్డే రాజు, తిరుపతి, జీ ప్రభాకర్, వై వినోద్ రెడ్డి, ఎస్ వినోద్ రెడ్డి, ఎన్ శంకర్, తదితరులు పాల్గొన్నారు.

ఏజెన్సీ ప్రత్యేక డీఎస్సీ ప్రకటించాలి

ఉట్నూర్, డిసెంబర్ 5 : తెలంగాణ రాష్ట్రంలోని ఏజెన్సీ ప్రాంతంలో ప్రత్యేక డీఎస్సీ ప్రకటించాలని ఆదివాసీ తుడుం దెబ్బ నాయకులు రాష్ట్ర కోకన్వీనర్ గోడం గణేశ్, జిల్లా రాయి సెంటర్ అధ్యక్షుడు మెస్రం దుర్గు పటేల్ డిమాండ్ చేశారు. గురువారం ప్రెస్‌భవన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఏజెన్సీలో ఆదివాసీ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక డీఎస్సీని ప్రకటించాలన్నారు. అలాగే ఈనెల 9న ఆదివాసీల పోరాట దినోత్సవాన్ని ఇంద్రవెల్లి మండల కేంద్రంలో నిర్వహిస్తున్నామన్నారు. కావున ఆదివాసీలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు పెందూర్ దాదిరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి గట్టి మనోజ్, మహిళా నాయకురాలు పెందూర్ పుష్పారాణి, సర్‌మేడీ సలాందేవ్‌రావు, త్రియాంబక్, బారిక్‌రావు పాల్గొన్నారు.

ఆదివాసీ మాతృశక్తి జిల్లా కమిటీ ఎన్నిక

ఉట్నూర్ రూరల్, డిసెంబర్ 5: మండలంలోని గుస్సాడి గుట్ట సంఘ కార్యాలయంలో గురువారం జిల్లా మాతృశక్తి నూతన కమిటీ ఎన్నుకున్నట్లు ఐటీడీఏ మాజీ చైర్మన్, మాజీ గ్రంథాలయ చైర్మన్ కనక యాదవ్‌రావు, గోండ్వానా రాష్ట్ర సమితి అధ్యక్షుడు మంగం విషంరావు అన్నారు. అధ్యక్షరాలుగా సిడాం కౌసల్య, ఉపాధ్యక్షురాలిగా మడావి నీలాబాయి, ప్రధాన కార్యదర్శిగా సిద్దుల భూమక్క, కోశాధికారిగా పెందూర్ జయ, కార్యవర్గ సభ్యులుగా ఆత్రం నిర్మల, మెస్రం శశికల, సిడాం లేతుబాయి, గేడం వీణా, కొడప రాధబాయి, టేకం లక్ష్మిబాయిని ఎన్నుకున్నట్లు తెలిపారు. కార్యవర్గ ప్రతులను సంబంధిత అధికారులకు అంజేసినట్లు తెలిపారు.

అంబేద్కర్ వర్ధంతికి పార్టీలకతీతంగా తరలిరావాలి

ఎదులాపురం, డిసెంబర్ 5 : ఈనెల 6న నిర్వహించనున్న డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ వర్ధంతి కార్యక్రమానికి పార్టీలకతీతంగా అంబేద్కర్ వాదులు, దళిత సంఘాల ప్రతినిధులు, అభిమానులు తరలిరావాలని భారతీయ బౌద్ధ మహాసభ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రత్నజాడే ప్రజ్ఞాకుమార్ కోరారు. గురువారం కలెక్టర్ రాజర్షి షాను కలెక్టరేట్‌లో మర్యాద పూర్వకంగా కలిసిన వివిధ దళిత సంఘాల నాయకులు కార్యక్రమానికి హాజరుకావాలని ఆహ్వానించారు. ఉదయం 10 గంటలకు పట్టణంలోని అంబేద్కర్ చౌక్‌లో నిర్వహించే అంబేద్కర్ వర్ధంతి కార్యక్రమానికి పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఇక్కడ కేంద్ర శిక్షక్ కాంతారావు వాగ్మారే, మాజీ జిల్లా అధ్యక్షులు దయానంద్ కాంబ్లే, బుద్ధిస్ట్ ఎంప్లాయిస్ ప్రెసిడెంట్ సత్యవాన్ చిట్టే, అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ రంగ్‌రావు వాటోరే, షెడ్యూల్డ్ కులాల హక్కుల పరిరక్షణ సంస్థ జిల్లా యువజన అధ్యక్షుడు రాజు మస్కే, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు ఉజ్వల దూడే, ప్రధాన కార్యదర్శి మాయవతి ససానే పాల్గొన్నారు.

రైతుబజార్‌లో తప్పనున్న పార్కింగ్ ఇబ్బందులు

ఎదులాపురం, డిసెంబర్ 5: రైతు బజార్‌కు వచ్చే వారికి ఇకపై వాహనాల పార్కింగ్ కోసం ఇబ్బందులు తప్పుతాయని మార్కెటింగ్ కార్యదర్శి గజానంద్ అన్నారు. పట్టణంలోని వినాయక్ చౌక్‌లోని రైతు బజార్‌లో పార్కింగ్ సమస్య ఎదురవుతుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో గురువారం రైతు బజార్‌లో లోపల వరుస క్రమంలోలేని దుకాణాలను పోలీసులు, మున్సిపల్ అధికారుల సాయంతో తీసివేయించారు. మార్కెటింగ్ అధికారి గజానంద్ ఆధ్వర్యంలో మార్కెట్ బయట దుకాణాలు వేసిన వారికి లోపల స్థలం చూపించి అక్కడ దుకాణాలు పెట్టుకునేలా అవకాశం కల్పించారు. వన్ టౌన్ సీఐ బీ సునీల్ కుమార్, ఎస్ఐ అశోక్‌తోపాటు ట్రాఫిక్ పోలీసులు వ్యాపారస్తులు, రైతులతో మాట్లాడి ట్రాఫిక్, పార్కింగ్‌కు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని కోరారు.

ఎమ్మెల్యేల అరెస్టు అప్రజాస్వామికం

పెంబి, డిసెంబర్ 5: కౌశిక రెడ్డి, హరీశ్‌రావుల అరెస్ట్ అప్రజాస్వామికమని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సల్లా నరేందర్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, కౌశిక్ రెడ్డి అక్రమ అరెస్ట్‌ను ఖండించారు. పరిపాలనపై దృష్టి సారించి ఆరు గ్యారెంటీలు అమలు చేయాలని అన్నారు. అరెస్టులు, బెదిరింపులకు బీఆర్ఎస్ నాయకులు భయపడరని హెచ్చరించారు. ఇచ్చిన హామీలను నెరవేర్చడంపై సీఎం రేవంత్‌రెడ్డి దృష్టి సారించాలన్నారు. ఆరు గ్యారెంటీలు అమలయ్యే వరకు చేసే పోరాటంలో జైలుకు వెళ్లడానికి కూడా సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు భూక్యా గోవింద్, సుతారి మహేందర్, ఇస్మాయిల్, చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

పెంబి: మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

ఎమ్మెల్యేల అరెస్ట్ హేయనీయం

హరీశ్‌రావు, కౌశిక్‌రెడ్డిని బేషరుతుగా విడుదల చేయాలి
రైతు బంధు సమితి జిల్లా మాజీ డైరెక్టర్ కొక్కుల ప్రదీప్

ఖానాపూర్, డిసెంబర్ 5: బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, కౌసిక్‌రెడ్డిలను పోలీసులు అరెస్టు చేయడాన్ని రైతు బంధు సమితి జిల్లా మాజీ డైరెక్టర్ కొక్కుల ప్రదీప్ తీవ్రంగా ఖండించారు. గురువారం ఖానాపూర్‌లోని బీఆర్ఎస్ క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలంగాణలో సీఎం రేవంత్‌రెడ్డి పాలనతో ప్రజలకు రజాకార్ల రాజ్యం మళ్లీ వచ్చిందని స్పష్టంగా అర్థమైందని మండిపడ్డారు. హామీల అమలు, ప్రజా సమస్యలపై నిలదీస్తే అరెస్టులు చేస్తారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అరెస్ట్ చేసిన ఎమ్మెల్యేలను బేషరతుగా విడుదల చేయాలని, లేదంటే క్షేత్రస్థాయి నుంచి బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు.

పిరికిపందల చర్య

బైంసా, డిసెంబర్, 5: మాజీ మంత్రి హరీశ్ రావు, ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డిని అరెస్టు చేయడం పిరికిపందల చర్య అని ముథోల్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకుడు డాక్టర్ కిరణ్ కొమ్రేవార్ అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ఇచ్చిన గ్యారెంటీలను అమలు చేయలేక ఫ్రస్టేషన్‌లో ఇలాంటి కవ్వింపు చర్యలకు పాల్పడుతున్నారన్నారు. ఒక ఉద్యమ నేత, మాజీ మంత్రి హరీశ్ రావుపై కేసు పెట్టిన ప్రభుత్వం, ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి ఫోన్‌ట్యాప్ అయిందని కంప్లెంట్ ఇస్తే దానిని పట్టించుకోకుండా విధులకు ఆటంకం కలిగిస్తున్నాడని ఎమ్మెల్యేపై కేసు పెట్టడమనేది అప్రజాస్వామికమన్నారు. గురుకులాల్లో విద్యార్థులుపడే ఇబ్బందులు తెలుసుకోవడానికి గురుకుల బాట పడుతున్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలకు అంక్షలు పెడుతూ అరెస్టు చేస్తున్నారన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెబుతారని తెలిపారు.

కోర్టు ఆదేశాలు హర్షణీయం

కుభీర్, డిసెంబర్ 5 : హైకోర్టు మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావును అరెస్టు చేయవద్దని ఆదేశాలు జారీ చేయడం హర్షణీయమని మాజీ వైస్ ఎంపీపీ ఎస్కే మొహియొద్దీన్, బీఆర్ఎస్ మండల నాయకుడు అన్నారు. కాంగ్రెస్ నాయకుడు చక్రధర్ గౌడ్ తన ఫోన్ ట్యాపింగ్ చేశారని పంజాగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో హరీశ్‌రావును గురువారం అరెస్టు చేశారు. దీంతో హైకోర్టు సానుకూలంగా స్పందించి ఆయనను అరెస్టు చేయొద్దంటూ ఆదేశాలు జారీ చేయడంపై న్యాయమే గెలుస్తుందని స్పష్టమైందన్నారు. అక్రమ అరెస్టులతో భయభ్రాంతులకు గురి చేయడం కాంగ్రెస్ నైజమన్నారు. హరీశ్‌రావు అక్రమ అరెస్టుతో రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై యావత్ తెలంగాణ ప్రజలు దుమ్మెత్తి పోస్తుందని పేర్కొన్నారు.

ఎన్‌సీసీ శిక్షణతో నాయకత్వ లక్షణాలు

- కమాండింగ్ ఆఫీసర్ కల్నాల్ వికాస్ శర్మ

ఎదులాపురం, డిసెంబర్5 : ఎన్‌సీసీ శిక్షణతో కేడెట్లలో నాయకత్వ లక్షణాలతోపాటు దేశభక్తి పెరుగుతుందని కమాండింగ్ ఆఫీసర్ కల్నాల్ వికాస్ శర్మ అన్నారు. గురువారం డీటీసీలో ఎన్‌సీసీ 2వ వార్షిక శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ముందుగా కేడెట్ల గౌరవ వందం స్వీకరించారు. అనంతరం శిక్షణలో పాల్గొని కేడెట్లకు మెడల్స్ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశ రక్షణలో భాగస్వాములు కావాలనే విద్యార్థులకు ఎన్‌సీసీ మంచి వేదికన్నారు. పది రోజులు క్యాంప్ ఎన్‌సీసీ లక్ష్యాలు, కర్తవ్యాల తోపాటు ఇతర అంశాల్లో శిక్షణ ఇచ్చారన్నారు. ఉమ్మడి జిల్లాలోని ఆయా పాఠశాలలకు చెందిన విద్యార్థులు శిబిరంలో అనేక అంశాలను నేర్చుకున్నారని తెపారు. కార్యక్రమంలో కెప్టెన్ జగ్జరాం, అశోక్, లెఫ్టినెంట్ ఐలయ్య, ప్రశాంత్, వివిధ స్కూళ్లకు చెందిన ఎన్సీసీ కెడెట్లు, సీనియర్ జేసీవో భగీరత్, శిక్షణ జేసీవో బ్రిజేష్ పాల్గొన్నారు.

ఎన్‌సీసీ కెడెట్లకు మెడల్స్ అందజేస్తున్న కమాండింగ్ ఆఫీసర్ కల్నాల్ వికాస్ శర్మ

ఉత్తమ ఎన్‌సీసీ విద్యాసంస్థల అధికారిగా ఎన్ సాయినాథ్

నర్సాపూర్ (జీ), డిసెంబర్, 5 : ఆదిలాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో జరుగుతున్న ఎన్‌సీసీ రెండో వార్షిక శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమంలో 32వ తెలంగాణ పటాలం కమాండింగ్ అధికారి కల్నాల్ వికాస్ శర్మ మొదటి శ్రేణి అధికారి మాలెపు పూర్ణచందర్ (జడ్పీఎస్ఎస్ పొన్కల్) మూడవ శ్రేణి అధికారులు నారి వినోద్ కుమార్ (జడ్పీఎస్ఎస్, కడం), ఎన్ సాయినాథ్ (జడ్పీఎస్ఎస్ నర్సాపూర్ జీ) లకు ఉత్తమ ఎన్‌సీసీ విద్యా సంస్థల పురస్కారాన్ని అందజేశారు. ఈ సందర్భగా కమాండింగ్ అధికారి వికాస్ శర్మ మాట్లాడుతూ, కేడెట్ల ఆన్‌లైన్ ఎన్‌రోల్‌మెంట్ ఆల్ ఇండియా శిక్షణ శిబిరాలకు కేడెట్లను పంపుతూ ఆదిలాబాద్ యూనిట్‌ను గర్వపడేలా చేసినందుకు వీరు పురస్కారాలు పొందారని అన్నారు. కార్యక్రమంలో ఎస్.ఎం. భగీరథ్, ఎన్‌సీసీ అధికారులు, పీఐ సిబ్బంది పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

సోన్, డిసెంబర్ 5 : సోన్ మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో తాత్కాలిక గణితశాస్త్రం బోధించేందుకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కేజీబీవీ ఎస్‌వో లతాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెస్సీ బీఈడీ, బీఎస్సీ బీఈడీ అర్హత కలిగిన అభ్యర్థులు ఈనెల 6వతేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు 9912 832511కు సంప్రదించాలన్నారు.

కొనసాగుతున్న శ్రీరామ మందిర ప్రాణప్రతిష్ఠోత్సవాలు

ముథోల్, డిసెంబర్, 5: మండలంలోని అష్టా గ్రామంలోని శ్రీరామ చంద్రుడి మందిర ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవం కొనసాగుతున్నది. మూడోరోజు గురువందనం, వేద స్వస్తి ప్రాతఃకాల పూజ, మహా పూర్ణాహుతి తదితర కార్యక్రమాలను మాదవానంద సరస్వతి స్వామివారిచే నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు.

చెరువు స్థితిపై సర్వే

కుంటాల, డిసెంబర్, 5: వెంకూర్ చెరువు అలుగు, ఇతర ప్రాంతాలను గురువారం ఇరిగేషన్ సిబ్బంది సర్వేచేసి కొలతలు సేకరించారు. అలుగు పరిస్థితిపై కారణాలు తెలుసుకోవడానికి సర్వేలు చేసి పలు డిజైన్లను హైదరాబాద్‌లోని చీఫ్ ఇంజినీర్-సీడీవో కార్యాలయానికి అనుమతుల కోసం పంపబోతున్నట్టు ఇరిగేషన్ ఏఈఈ మిరాజుద్దీన్ తెలిపారు.

ఏడాది పాలనలో రజకుల అభివృద్ధి శూన్యం

బైంసా, డిసెంబర్, 5: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంవత్సర పాలనలో రజకులకు ఎలాంటి అభివృద్ధి జరగలేదని రజక బీసీ హక్కుల పరిరక్షణ సమితి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కన్వీనర్ సుంకెట పోశెట్టి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రజక నిరుద్యోగ యువతకు 50 శాతం సబ్సిడీతో కూడిన రూ.10 లక్షలు అందజేయాలని, ప్రభుత్వ నామినేటెడ్ పదవుల్లో రజక జాతికి పెద్దపీట వేయాలన్నారు.

నూనె గింజల సాగుపై దృష్టి సారించాలి

పెంబి, డిసెంబర్ 5: అధిక లాభాలను అందించే నూనె గింజల సాగుపై రైతులు దృష్టి సారించాలని సేవా స్ఫూర్తి ఫౌండేషన్ ప్రాజెక్టు మేనేజర్ రత్నాకర్ రైతులకు సూచించారు. గురువారం మండల కేంద్రంలోని మ్యాక్స్ సొసైటీ భవనంలో వ్యవసాయ శాఖ, నూనె గింజల పరిశోధన సంస్థ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కల్పించారు. తక్కువ సమయంలో ఎక్కువ లాభాలు అందించే నూనె గింజల సాగుపై దృష్టి సారించాలన్నారు. ఇక్కడ ఏడీఏ సుజాత, ఏవో నవీన్, బాస్కర్, ఏఈవోలు రాజ్‌కుమార్, లక్ష్మణ్, రైతులున్నారు.

ప్రతి విద్యార్థికీ చదవడం రావాలి

నిర్మల్ చైన్‌గేట్, డిసెంబర్,5: ప్రభుత్వ విద్యాలయాల్లో చదివే ప్రతి విద్యార్థికి చదవడం, రాయడం రావాలని రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి అన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ అభిలాష అభినవ్ తో కలిసి ప్రభుత్వ పాఠశాలలో విద్యా ప్రమాణాల పెరుగుదలకు చేపట్టాల్సిన చర్యలపై అధికారులు, ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్‌కుమార్, డీఈవో రామారవు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

కుభీర్, డిసెంబర్ 5 : మండలంలోని మాలేగాంవ్ గ్రామంలోని జీపీలో గురువారం బైంసా పట్టణానికి చెందిన స్త్రీ వైద్య నిపుణురాలు డాక్టర్ స్నేహారెడ్డి ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి రోగులకు సేవలందించారు. స్త్రీలలో వచ్చే వ్యాధులు-తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆమె వివరించారు. అనంతరం రోగులకు మందులను పంపిణీ చేశారు. శిబిరంలో మాజీ సర్పంచులు మహిపాల్‌రెడ్డి, కె.శంకర్, రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు రమేశ్, వీరేందర్, మహేశ్‌గౌడ్, పాపన్న తదితరులు డాక్టర్ స్నేహారెడ్డిని సత్కరించారు.

ఐక్యమత్యంతో ప్రగతి సాధ్యం

వేంకటేశ్వర స్వామి కల్యాణంలో పాల్గొని పూజలు చేస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

తాంసి(భీంపూర్), డిసెంబర్ 5 : గ్రామాల్లో ఆధ్యాత్మిక భావన, ఐక్యత ఉంటే తప్పక ప్రగతి సాధ్యమవుతుందని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ గుర్తు చేశారు. భీంపూర్ మండలం ధనోరాలో ఆయన భూదేవి, శ్రీదేవి సహిత వేంకటేశ్వర స్వామి కల్యాణానికి హాజరయ్యారు. వేద, పండితులు ఎమ్మెల్యేను ఆశీర్వదించారు. ఇక్కడ బీఆర్ఎస్ మండల కన్వీనర్ మేకల నాగయ్య, మాజీ జడ్పీటీసీ కుమ్ర సుధాకర్, వైస్ ఎంపీపీ గడ్డం లస్మన్న, నాయకులు గోప సుభాష్, మహేందర్, గోవర్ధన్ యాదవ్, క్రాంతి, మురళి, నరేందర్, కల్చాప్‌యాదవ్, సంజీవ్ రెడ్డి, కుడిమెత సంతోష్, లింబాజీ, గంగన్న ఉన్నారు.

సొనాల రామాలయంలో ప్రత్యేక పూజలు

బోథ్, డిసెంబర్ 5 : సొనాలలోని రామాలయంలో గురువారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామానికి చెందిన చిలుకూరి నరేందర్ కుటుంబీకులు అయ్యప్ప స్వామి దీక్షపరులకు భిక్ష కార్యక్రమం ఏర్పాటు చేశారు. పూజల అనంతరం ఎమ్మెల్యే భిక్షలో పాల్గొన్నారు. ఎమ్మెల్యేను అయ్యప్ప భక్తులు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో బోథ్, సొనాల మండలాల బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ నేల దినోత్సవం

కుంటాల : ఓలాలో రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

కుంటాల, డిసెంబర్, 5: ప్రపంచ నేల దినోత్సవాన్ని గురువారం రైతువేదికల్లో రైతులతో కలిసి ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా రైతులకు భూసార పరీక్షపై వ్యవసాయ అధికారులు అవగాహన కల్పించారు. రసాయన ఎరువులు, పురుగుమందులు, గడ్డిమందులు ఎక్కువగా వాడడంతో భూమి నాణ్యత కోల్పోయి నేల స్వభావం దెబ్బతింటుందని తెలిపారు. ఇక్కడ ఏఈవోలు, రైతులు తదితరులున్నారు.

నేషనల్ స్కాలర్‌షిప్‌నకు ఎంపిక

విద్యార్థులను అభినందిస్తున్న వీసీ

బాసర, డిసెంబరు 5 : బాసర ఆర్జీయూకేటీలో విద్యార్థినిలు నేషనల్ స్కాలర్‌షిప్‌నకు ఎంపికయ్యారని వీసీ గోవర్ధన్ తెలిపారు. ఇంజినీరింగ్ ద్వితీయ సంవత్సరం విద్యార్థినులు కాకర్ల, సింధూర, కడలి ఫణి విష్ణుశ్రీ, తా తిరెడ్డి ధరణి, నాలుగో సంవత్సరం చదువుతున్న విద్యార్థిని నల్ల ప ల్లవి ప్రిన్స్‌టన్ ఫౌండేషన్ పీస్ అండ్ లెర్నింగ్, న్యూజెర్సీ అమెరికా సంస్థ అందించే స్కాలర్‌షిప్‌లకు ఎంపికయ్యారని ఈ సందర్భంగా వారికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ట్రిపుల్ ఐటీ అధికారులున్నారు.

ఆర్జీయూకేటీని సందర్శించిన విద్యాకమిషన్ చైర్మన్

విద్యార్థులతో ముఖాముఖిలో మాట్లాడుతున్న విద్యా కమిషన్ చైర్మన్ అకునూరి మురళి

బాసర, డిసెంబరు 5 : బాసర ట్రిపుల్ఐటీని గురువారం విద్యాకమిషన్ చైర్మన్, రిటైర్డ్ ఐఏఎస్ అకునూరి మురళి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన యూనివర్సిటీలోని వసతి గృహాలు, విద్యార్థుల గదులు, భోజనశాల, విద్యార్థులకు అందిస్తున్న సేవలు, విద్యార్థుల కసం తీసుకుంటున్న చర్యలు తదితర అంశాలను పరిశీలించారు. స్టూడెంట్ యాక్టివిటీ సెంటర్‌లో ఆడిటోరియం, కబడ్డీ కోర్టు, టెన్నిస్, ఖోఖో క్రీడా సంబంధిత పరిసరాలను పరిశీలించారు. పలు వివరాలను వీసీ గోవర్ధన్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కాన్ఫరెన్స్ హాల్‌లో విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్జీయూకేటీ బాసరను ఉత్తమ విద్య అందించే సంస్థగా ఉంచేందుకు ప్రత్యేకదృష్టి సారిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ట్రిపుల్ఐటీ ఇన్‌చార్జి వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ గోవర్ధన్, ఐఐఎఫ్‌టీ మాజీ డైరెక్టర్ ప్రొఫెసర్ మురళీదర్శన్, ఏవో రణదీర్‌సాగి, ఆధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నర్సాపూర్ (జీ), డిసెంబర్, 5 : మండల కేంద్రంలోని కస్తుర్బా గాంధీ పాఠశాలను గురువారం రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి, జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ సందర్శించారు. విద్యార్థులకు నాణ్యమైన , రుచికరమైన ఆహారాన్ని అందించాలని సూచించారు. ఇక్కడ ఎస్‌వో వీణ, జిల్లా వ్యవసాయాధికారి అంజిప్రసాద్, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో పుష్పలత, ఎంఈవో కిషన్‌రావు, ఉపాధ్యాయులు ఉన్నారు.

హామీలను విస్మరించిన కాంగ్రెస్ సర్కార్

మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామారావు పటేల్

బైంసా, డిసెంబర్, 5: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా రేవంత్ రెడ్డి సర్కార్ పేదలను మోసం చేస్తున్నదని ఎమ్మెల్యే రామారావు పటేల్ అన్నారు. గురువారం పట్టణంలోని ఎస్ఎస్ జిన్నింగ్ ఫ్యాక్టరీలో ప్రభుత్వ ఏడాది పాలన వైఫల్యాలపై నిరసన తెలుపుతూ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడారు. సమావేశంలో ప్రోగ్రాం కమిటీ నియోజకవర్గ కన్వీనర్ రాజేశ్ బాబు, రావుల రాంనాథ్, తదితరులున్నారు. కాగా, కాంగ్రెస్ పార్టీ ఏడాది పాలన వైఫల్యాలపై బైంసాలో బీజేపీ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహిస్తుంటే ప్రభుత్వం, పోలీసులు అనుమతి ఇవ్వకపోవడంతో గురువారం రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఇక్కడ నియోజ